క్లుప్తంగా

అంగన్‌వాడీ వర్కర్ల సంబరాలు



బత్తలపల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న సీడీపీఓ సరస్వతి

బత్తలపల్లి: డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించిన అంగన్‌వాడీ వర్కర్లు సంబరాలు నిర్వహించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తర్వాత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సీడీపీఓ సరస్వతితో కేక్ కట్ చేయించారు. సీఐటీయూ కార్యదర్శి వాసంతి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలోని ఎన్జీవో హోంలో అంగన్‌వాడీ వర్కర్లు విజయోత్సవ సభ నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు మాట్లాడుతూ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు.

పుట్టపర్తి అర్బన్: సమ్మె విరమించిన అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంతో సంతోషంగా సమ్మె విరమించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఐటీయూ నాయకులు వెంకటేష్, ఇంతియాజ్, బ్యాల్ల అంజి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఎన్పీకుంట: ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఈటిరాము అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ముగిసిన భాగవత పఠనం



గోమాతను ఊరేగిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: గ్రామీణుల్లో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు మండలంలోని తంబాపురం గ్రామంలోని రామాలయంలో ఈ నెల 17నుంచి నిర్వహించిన భాగవత సప్తాహ పఠనం మంగళవారం ముగిసింది. రోజూ తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల వరకు గీతా పారాయణం, అనంతరం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భాగవత పఠనం నిర్వహించారు. చివరి రోజు గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు గోమాతను ఊరేగింపు నిర్వహించారు. భాగవత పఠనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ సర్పంచు సానే జయచంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయండి

ఎన్పీకుంట: మేకలచెరువు పంచాయితీ కేంద్రంలో మొబైల్ సెల్ టవర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మొబైల్ ఫోన్‌లో సిగ్నల్స్ కోసం ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల వివరాలు, సర్వేలో సమాచారం పొందుపరచాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సెల్‌టవర్ ఏర్పాటు చేసి నెట్‌వర్క్ అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

బళ్లారి దుర్గమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో బళ్లారి దుర్గమ్మ తల్లి

బత్తలపల్లి: బత్తలపల్లిలో కొలువైన బళ్లారి దుర్గమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకురాలు రాములమ్మ దుర్గమ్మకు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు

పుట్టపర్తి: బుక్కపట్నంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి బెంగళూరుకు చెందిన బిల్డర్స్ కిరణ్, లక్ష్మీకాంత్, ఉమేష్, శ్రీనివాస్, నీలకంఠం రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు చెక్కును మంగళవారం కమిటీ సభ్యులకు అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

బత్తలపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ కొనియాడారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత సాయం అందించే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ప్రారంభించిన సందర్భంగా బత్తలపల్లిలోని భారతి మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పాల్గొని మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు మాట ఇచ్చి మోసం చేశారన్నారు. అయితే జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. 11-04-2019 నాటికి గ్రూపు సభ్యులపై ఎంత బ్యాంకు రుణం ఉందో అంత నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. మొత్తం 670 సంఘాలకు 6,513 మంది సభ్యులకు రూ.22.53 కోట్లు సభ్యుల ఖాతాల్లో జమ చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నను ముఖ్యమంత్రిగా, కేతిరెడ్డిని ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా డి.చెర్లోపల్లి, రామాపురం, దంపెట్ల, ఈదుల ముష్ఠూరు, తంబాపురం, బత్తలపల్లి, మాల్యవంతం గ్రామాల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కోఆర్డినేటర్ రామేశ్వర్‌రెడ్డి, ఏపీఎం సుదర్శన్‌రాజు, సర్పంచులు గుజ్జల రమాదేవి, బండి సరస్వతి, కరుణాకర్‌నాయుడు, గోపాల్, సానే జయచంద్రారెడ్డి, నాగానంద, సుధాకర్, వెంకటసత్యం, శంకర్, రీజనల్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, అకౌంటెంట్ గోవిందమ్మ పాల్గొన్నారు.





బత్తలపల్లిలో సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం, తాడిమర్రిలో జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి

జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం

తాడిమర్రి: అక్కచెల్లెమ్మల సంక్షేమమే సీఎం వైఎస్ జగనన్న ధ్యేయమని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని ఎస్‌హెచ్‌జీ మహిళలకు నాలుగో విడతలో రూ.3.10 కోట్లు విడుదల చేయడంపై ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో కలసి సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఏపీఓ సాంబశివుడు మాట్లాడుతూ మండలంలో 382 మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాల్లో 3791 మంది సభ్యులు ఉన్నారన్నారు. నాలుగేళ్లుగా మహిళలకు రూ.12.40 కోట్లు మహిళల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు.

జగనన్నకు ఘన స్వాగతం

పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద నాలుగో విడత నిధులు విడుదల చేసేందుకు మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.



సీఎం జగన్‌కు బొకే అందజేస్తున్న పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ



సీఎం జగన్‌కు బొకే అందజేస్తున్న జిల్లా అగ్రీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ



సీఎం జగన్‌కు బొకే అందజేస్తున్న పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బొకే అందజేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

మంత్రికి ఘన స్వాగతం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: రాష్ట్ర అటవీ, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం కదిరికి విచ్చేశారు. ఈ సందర్భంగా కదిరి మండల పరిధిలోని గట్ల వద్ద కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో తరలివెళ్లి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

నల్లచెరువు: అనంతపురం జిల్లా ఉరవకొండకు విచ్చేసి తిరిగి వెళ్తున్న రాష్ట్ర అటవీ, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నల్లచెరువు మాజీ సర్పంచ్ రవికుమార్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు.

నేడు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాదయాత్ర సాగేదిలా



గాజులపల్లి వద్ద సిద్ధం చేసిన రిజర్వాయర్ పైలాన్

పుట్టపర్తి అర్బన్: నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపాలనే ఆశయంతో ఆరు మండలాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర 6వ రోజు బుధవారం పుట్టపర్తి మండలంలో కొనసాగనుంది. 5 రోజుల్లో మొత్తం 99.6 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయ్యింది. బుధవారం ఉదయం 9 గంటలకు పెడపల్లిలో పాదయాత్ర ప్రారంభించి పెడపల్లి పెద్దతండా, కోనాపురం, మార్లపల్లి, సూరగానిపల్లి, కొట్లపల్లి, కొత్త నిడిమామిడి, నిడిమామిడి, దండువారిపల్లి, కత్తివారిపల్లి, గాజులపల్లి సమీపంలోని రిజర్వాయర్ వద్ద పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. అక్కడి నుంచి తిరిగి నిడిమామిడికి చేరుకొని అక్కడ బహిరంగ సమావేశం నిర్వహించనున్నారు. అక్కడే రాత్రి బస చేయనున్నారు.

ఉరుసుకు ముస్తాబైన దర్గా



బాబా షర్ఫోద్దీన్ దర్గా వద్ద షామియానా తదితర ఏర్పాట్లు

తలుపుల: మండల కేంద్రం కుమ్మరపేటలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న బాబా షర్ఫోద్దీన్ దర్గా ఉరుసుకు కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. దర్గాను రంగురంగులతో అలంకరించి భక్తులకు మంచినీరు, నీడ తదితర సదుపాయాలు కల్పించారు. మండలవాసులే కాక, కదిరి, పులివెందుల, ఎన్పీకుంట తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాండ్లపెంట: గాండ్లపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడడంతో బుధవారం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథ్ మంగళవారం తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

జానపద గ్రంథాల వితరణ



గ్రంథాలయ సిబ్బందికి జానపద గ్రంథాలు అందిస్తున్న రచయిత చిగిచెర్ల కృష్ణారెడ్డి

ధర్మవరం అర్బన్: ధర్మవరంలోని క్రియాశక్తి ఒడయార్ పురాతన గ్రంథాలయానికి రచయిత డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి, కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణ మంగళవారం జానపద గ్రంథాలను అందించారు. చిగిచెర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాను రచించిన జానపద గ్రంథాలు రాయలసీమ ప్రజలకు అందరికి తెలుసన్నారు. జానపద గ్రంథాలు ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని గ్రంథాలయానికి అందిస్తున్నామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. అందరికీ రక్ష



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ధర్మవరం రూరల్: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల వైద్యాధికారిణి పుష్పలత అన్నారు. మండల పరిధిలోని పోతులనాగేపల్లి గ్రామంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ నివేదిక, డాక్టర్ వెంకటేశ్వర్లు 375 మందికి వైద్య చికిత్సలు అందించి మందులను పంపిణీ చేశారు.

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి

• ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు తాగు నీరు, సీసీ రోడ్లు, వీధిదీపాలు తదితర వసతులు కల్పించాలన్నారు. అనంతరం అధికారులు వారి శాఖల ప్రగతిని వివరించారు. ఎంపీడీఓ విజయలక్ష్మీ మాట్లాడుతూ సర్పంచులు ఇప్పటిదాకా చేసిన పనులకు పీఎఫ్‌ఎంఎస్ నిధులు రూ.66.60 లక్షలు విడుదల అయ్యాయన్నారు. మరో రూ.66.66 లక్షల నిధులు త్వరలోనే విడుదల అవుతాయన్నారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ మండలంలో 925 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడానికి సిద్ధం చేశామన్నారు. 1,306 మందికి చెందిన అసైన్‌మెంట్ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గుర్తించామన్నారు. ఏఓ రమాదేవి మాట్లాడుతూ కంది పంటను అధికారులే రైతుల ఇళ్లవద్దకు వెళ్లి క్వింటా రూ.9,375తో కొనుగోలు చేస్తారన్నారు. ఎంఈఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా రూ.30 కోట్లతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీలు బీసాని లింగమ్మ, యర్రగంగు కృష్ణమనాయుడు, కో ఆప్షన్ సభ్యుడు బాబాఫక్రొద్దీన్, ఏపీఓ సంజీవరెడ్డి, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీ, ట్రాన్స్‌కో ఏఈ విజయ్ శేఖర్ పాల్గొన్నారు.

నేతాజీ సేవలు మరువలేనివి



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: దేశ స్వాతంత్య్రం కోసం అనేక పోరాటాలు చేసిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనవని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం అయన చేసిన సేవలను కొనియాడారు. కొండమరాజు, జ్యోతి ప్రసాద్, బాలగంగాధర్, రామాంజనేయులు, కళ్యాణ్, నారాయణ ధర్మరాజు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీధర్

తలుపుల: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలనే విషయంపై తహసీల్దార్ కే.శ్రీధర్ మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరును వివరించారు. ఓటు వేసిన తర్వాత అది నమోదు అయ్యిందా లేదా అనేది ఎలా తెలుసుకోవాలి, టోటల్ కౌంటింగ్ ఎలా చేయచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఆర్ఓ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నానా దర్గా ఉరుసు గంధం

కదిరి అర్బన్: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న నానా దర్గా ఉరుసు గంధం మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. పరికి వంశీయులు అందంగా అలంకరించిన చాందినీ బండిలో దర్గాకు చేరుకొని గంధం సమర్పణ చేశారు. అనంతరం నానా స్మరణ సభ నిర్వహించారు. 24న ఉరుసే షరీఫ్, 25న జియారత్ కార్యక్రమాలు జరుగుతాయి.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

అమడగూరు: ఓడీచెరువు మండలం గజ్జిబండ తండాకు చెందిన పది కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్రలో భాగంగా మంగళవారం వారంతా పార్టీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తండాకు చెందిన రమేష్‌నాయక్, రవి నాయక్, గోపీ నాయక్‌తో పాటుగా పలు కుటుంబాలు పార్టీలోకి చేరాయి. వైఎస్సార్‌సీపీలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పేద కుటుంబాల్లో చిచ్చు రేపుతున్న టీడీపీ



మాట్లాడుతున్న భానుకోట మహిళలు

కనగానపల్లి: పేదల కుటుంబాల్లో టీడీపీ నాయకులు చిచ్చుపెడుతున్నారని భానుకోట గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ మహిళలు వాపోయారు. మంగళవారం మండల కేంద్రంలో భానుకోటకు చెందిన వాల్మీకి అక్కమ్మ, పెద్దక్క, కుళ్లాయమ్మ, హరిజన పెద్దక్క విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భానుకోటలోని బీసీ, ఎస్సీ కుటుంబాల్లోని మహిళలు అనేక పథకాల ద్వారా లబ్ధిపొందారన్నారు. కానీ టీడీపీ నాయకురాలు పరిటాల సునీత సోమవారం గ్రామానికి వచ్చి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన గౌతమిని వారి మీటింగ్‌కు పిలిపించుకొని వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేయించడం సరికాదన్నారు. ఆమె చేసిన విమర్శల్లో ఎంత మాత్రం వాస్తవం లేదని, కేవలం టీడీపీ నాయకులు చెప్పించారన్నారు. వాల్మీకి కుటుంబానికి చెందిన గౌతమి భర్త కుళాయప్ప రెండేళ్లక్రితం అనారోగ్యంతో చనిపోతే వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెకు వితంతవు పింఛన్, ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో మాట్లాడి ఆమె భర్త సాగుచేస్తున్న 5 ఎకరాల పొలాన్ని కూడా గౌతమి పేరున పట్టా ఇప్పించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంత లబ్ధి పొంది కూడా ఆమె టీడీపీ నాయకులు చెప్పిన మాటలు విని ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో ఫ్యాక్షన్ గ్రామంగా ముద్రపడిన భానుకోట ప్రజలు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అండదండలతో వ్యవసాయ పనులు చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారని సర్పంచ్ బాలరాజు, నాయకులు మాధవరాజులు, ముత్యాలు తెలిపారు. పరిటాల కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు తిరిగి గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చురేపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు.

మండల ఓటర్లు 24,281

ఎన్పీకుంట: మండలంలో 24,281 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 12,161 మంది పురుష, 12,120 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కొత్త ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటే బీఎల్‌ఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పర్యటన

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి, నడిమిగడ్డపల్లి, దర్శనమల గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

ధర్మవరం అర్బన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లలో వెళ్లేవారు సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ సమయంలో తన కుటుంబ సభ్యులు ఇంటి వద్ద నా కోసం వేచి చూస్తుంటారని, సురక్షితంగా డ్రైవింగ్ చేసి ఇంటికి వెళ్లాలని ఆలోచించాలన్నారు. అప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. సురక్షిత ప్రయాణమే శ్రీరామ రక్ష అని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.



ప్రజలకు సూచనలు ఇస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

నేటి నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు

ధర్మవరం అర్బన్: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయ స్థాయి, మండలస్థాయి పోటీల్లో విజేతలైనవారికి ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ధర్మవరం పట్టణం, రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు సంబంధించి మహిళలకు 5 క్రీడా పోటీలు, పురుషులకు 5 క్రీడా పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్, వాలీబాల్, ఆర్డీటీ క్రీడా మైదానంలో ఖోఖో, కబడ్డీ, కళాజ్యోతిలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని వివరించారు. సకాలంలో క్రీడాకారులు చేరుకుని పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

31న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్క్యులర్ విడుదల చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. అధికారులు ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని సమావేశానికి హాజరు కావాలని తెలియజేశారు.